# పెద్దకథ

## -సదానందశారద

**వాసుకు తండ్రిని ఒకసారి చూడాలనిపించింది. తల్లితో ఆ మాట అనలేకపోతున్నాడు. పన్నెండేళ్ల వాసు ఏడవ తరగతి చదువుతున్నాడు. ఎప్పుడూ తనకు నీటైన డ్రెస్ వేసేది తల్లి. నీటుగా దువ్వేది. కడుపునిండా గోరుముద్దలు తినిపించేది. కథలు చెప్పేది. ఇప్పుడు తమ బతుకే ఒక కథగా మారింది.**



తల్లి నవ్వుమ చూడక ఆర్నెల్లు దాటింది. తల్లి గలగలా మాట్లాడదు. గడపదాటిపోదు. కూరగాయలకు తనే, కిరోసిన్, చక్కెర క్యూలకు తనే ఈ ఆర్నెల్లలో చదువులో బాగా వెనుకబడిపోయాడు వాసు.

తల్లి విచారవదనం, తండ్రిమీది బెంగ ఆ పసి మనసును కుంగదీశాయి.

చదువుకుంటున్నప్పుడు తండ్రి గుర్తుకువస్తే అక్షరాలు మసకబారి చెదిరిపోతాయి. పడుకున్నప్పుడు తండ్రి గుర్తుకొస్తే తలగడ తడిసిపోతుంది.

తండ్రి మోచేయిని తలగడ చేసుకొని పడుకున్న రోజులు గుర్తుకొస్తాయి. తండ్రి ఛాతీమీది వెంట్రుకలతో ఆడుకున్న క్షణాలు గుర్తుకొస్తాయి. "వాసూ- నువ్వు డాక్టరువి కావాలి..." అన్న తండ్రిమాటలు చెవుల్లో గింగురుమంటాయి (ఆ పసిమనసును రంపంలా పరపరా కోసేస్తాయి).

"నువ్వెంత మారిపోయావు నాన్నా...! మమ్మల్ని వొదిలి ఎందుకెళ్లావు నాన్నా...!" అని తల్లి చూడనప్పుడు వెక్కి వెక్కి ఏడుస్తాడు వాసు. ఈ కలంతో పరీక్షలు రాసి అన్నింట్లో ఫస్ట్ రావాలి అని తండ్రి తనకు కొనిచ్చిన కలాన్ని తడుముతాడు. తండ్రి వెచ్చని చేతిని తాకిన అనుభూతి కలుగుతుంది.

"అమ్మా! టాటా...!" అన్న తరువాత "నాన్నా! టాటా...!" అనబోయేవాడు అలవాటుగా కొన్నాళ్లు. క్రమంగా ఆ అలవాటును గుండెలోనే అణచుకున్నాడు.

ఇప్పడు తల్లికి టాటా చెప్పి, తండ్రికి చెప్పే టాటాను మనసులోనే అనుకుంటాడు. జీవంలేని

చూపుల్తో తల్లి తనవంక చూస్తుంది. ఇదివ రకటిలా అక్కున చేర్చుకోదు. నుదుట ముద్దు పెట్టుకోదు.

తల్లి నిర్లిప్తతను చూస్తుంటే వాసుకు దుఃఖం ఆగదు. "అమ్మా–అమ్మా–మాట్లాడమ్మా..." ఆమెను కుదిపి కుదిపి ఫలితంలేక ఆమె ఒళ్లో తలపెట్టి రోదిస్తాడు. తల నిమురుతూ శూన్యంలోకి చూస్తుంది. ఆ స్పర్శలో మునుపటి వెచ్చదనం లేదు. బుజ్జగింపు లేదు. అనునయం లేదు. వాత్సల్యం లేదు. అసలు తల్లికి బతకాలని లేదు.

తండ్రిని దూరం చేసుకొని, తల్లిని శిలగా

# మొగ్గ మందారం

చూడలేని వాసు చిన్నారి మనసు ఎంతో క్షోభ పడుతున్నది.

తల్లి కాళ్లకు తాళ్లలా తనూ, చెల్లెలు! లేకపోతే తల్లి ఏనాడో ఆత్మహత్య చేసుకునేది.

"నాన్న ఏడమ్మా?" అని చెల్లి అడిగితే "క్యాంపుకె ళ్లాడమ్మా" అని వూర్కోబెడుతుంది. ఆ మాటలు చెల్లి నమ్ముతుంది. రేపో మాపో వస్తాడు, తనకు మిఠాయి, బొమ్మలు తెస్తాడు అనుకుంటుంది.



## ధైర్యశాలి



ఈ దుస్తులు ధరించిన యువతి తన దుస్తులు విప్పేయాల్సిన అవసరమే లేదు. జపాన్ కళాకారుడు యాసుమాసా మొరిమురా అనే ఆవిడ ఫ్యాషన్ దుస్తుల తయారీవారితో కలిసి రూపొందించిన ఒక డ్రస్ మోడల్ మాత్రం ఇక్కడుంది. ఈ రకం దుస్తులను బీరువాలో పెట్టడం కన్నా అందరికీ కనిపించేట్టుగా గోడమీద వేలాడదీయడమే బాగుంటుందని న్యూస్ వీక్ ప్రకటించింది. అన్నట్టు ఈ డ్రస్సు తొడిగే ధైర్యం చేసిన అమ్మాయిని మీరు తలకిందులుగా వేలాడదీసినా అక్కడో కళాకృతి కనిపిస్తుంది చూడండి!

—మంజూష

తను అలా అనుకోలేదు. ఏది అబద్ధమో, ఏది నిజమో తెలుస్తున్న వయసు తనది. చెల్లిలా తను కూడా చిన్నపిల్లాడైవుంటే బాగుండేది. ఇన్ని ఆలోచనలు ఉండేవికావు. ఇన్ని సంగతులు తెలిసేవికావు. ఇంటి పరిస్థితులు అర్ధమయ్యేవికావు. తల్లి దుఃఖాన్ని చూడలేడు, ఓదార్చనూలేడు.

ఆ శైలజ ఎవరో రాక్షసి... మా నాన్నకు ఎందుకు పరిచయమైందో!

వాళ్లు చాలా ధనవంతులట... ఆమెకు కారుందట... మేడ ఉందట. మెదడు లేదు రాక్షసికి. మా నాన్నను చూడకపోతే మేమెంత తల్లడిల్లిపోతామో అర్థం చేసుకున్నదా? అనుకుంటాడు వాసు.

తల్లితో గొడవపెట్టుకున్నాడు తండ్రి. తనతో తీసుకుపోతానన్నాడు. తల్లి రానంది.

"మీకిద్దరికీ దాసిగా రమ్మంటున్నారా?" అని అడిగింది.

తండ్రికి కోపం వచ్చి తల్లిని కొట్టాడు. చెల్లెలు జడుసుకొని గుక్కపట్టి ఏడ్చింది. తను గజగజ వొణుకుతూ బల్లిలా గోడకు అంటుకుపోయ్యాడు.

"వాసూ... బ్యాగ్‌లో బట్టలు సర్దుకో వెళ్దాం" అన్నాడు.

అమ్మను చూస్తే జాలి అనిపించింది. అమ్మను ఒంటరిగా వొదిలి వెళ్లలేకపోయాడు.

రానని తల అడ్డంగా తిప్పాడు.

తండ్రి మరింత మండిపడ్డాడు. తనను బెల్టుతో కొట్టేవాడే. తల్లి అడ్డం నిల్చొని కాపాడింది. కోపమంతా తల్లిపై చూపించి—

"చావండి... ఇక్కడే చావండి" అని తిడుతూ వెళ్లిపోయాడు తండ్రి.

కానీ... తండ్రి అంటే కూడా తనకెంత ఇష్టమో ఎలా చెప్పేది!

తల్లి... ఆనాటి నుంచి గడపదాటి ఎరుగదు. ఇరుగు, పొరుగు మాటలు విని విని శిలలా మారిపోయింది తల్లి.

ఇదివరకు వారం, పదిరోజులకోసారైనా తండ్రి ఇంటికి వచ్చేవాడు. గొడవ పెట్టుకొని వెళ్లినప్పట్నించి పూర్తిగా రావడం మానేశాడు. ఆర్నెల్లు దాటింది: తండ్రి వస్తాడని రోజూ ఆశగా ఎదురుచూస్తున్నాడు వాసు. శైలజ నాన్నను కార్లో ఎక్కడ తిప్పుతున్నదో! వాళ్లకు పెద్ద బిజినెస్ ఉందట. ఏ బొంబేను తీసుకెళ్లిందో!

మేనమామ వచ్చాడు. తండ్రిని తిట్టాడు. కేసు పెడ్తానన్నాడు. తల్లి వద్దని వారించినా వినిపించుకోలేదు. బలవంతంగా కాగితాలమీద సంతకాలదాకా పోయింది వ్యవహారం. మామయ్య అది మా సమస్యకు పరిష్కారం అనుకున్నాడు. కోర్టులు నాన్నను ఇవ్వగలవా? "మామీద మనసుంటే తిరిగి రావాలి కానీ" అనేది తల్లి. ఆమాటే నిజం అనిపించింది తనకు.

తాను, చెల్లి నాన్నకు గుర్తుకు రాలేదా? ఆర్నెల్లు తమను చూడకుండా ఎలా ఉండగలిగాడు నాన్న?

తమ ఆర్థిక పరిస్థితి కూడా వాసుకు అర్థమవుతున్నది. కోర్టు ఖర్చులకు కావాలని తల్లి మెడలోని ఒక్క గొలుసూ తీసుకుపోయాడు మామయ్య. అదీ వాళ్లు తమను ఆదుకునే తీరు.

సొంత ఇల్లు కాబట్టి సరిపోయింది. అద్దె ఇల్లైతే ఎన్నిమాటలు పడేవాళ్లమో. నెలనెలా ఖచ్చితంగా అద్దె కట్టడానికి తమకు డబ్బు ఎలా వస్తుంది? అమ్మకు అభిమానం. ఎవరితో మాట పడదు. ఒకరిని అనవసరంగా అనదు.

అమ్మ కుట్టుమిషనే తమకు జీవనాధారమైంది. కోర్టులో గెలిస్తే నాన్న జీతంలో సగం మాకు వస్తుందట. సంవత్సరం దాకా ఆగాలట. కానీ... నాన్నకంటే ఎక్కువా ఆ డబ్బు?

చదువు మానేసి తామకూడా ఏదైనా పనిలోచేరి తల్లికి సహాయపడాలి అనుకున్నాడు వాసు.

"రూపాయికి రెండు... రూపాయికి రెండు..." అని పాప్‌కార్న్ ప్యాకెట్లు అమ్మే అబ్బాయిలు కళ్లలో మెదిలేవారు. ఆపని తాను సులభంగా చేయగలడు.

ఆ మాట చెబితే తల్లి తనను దగ్గరకు తీసుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

"నా రెక్కలున్నాయి కొడుకా— నాన్న మనతో లేకపోతేనేం నేనున్నాను. నీ తల్లిని బతికే ఉన్నాను నాన్నా. ఇంకోసారి ఇలాంటి ఆలోచనలు రానీయకు. ఇల్లు అమ్మైనా నిన్ను చదివిస్తా. నువ్వు బాగా చదువుకోవాలి. పెద్ద చదువులు చదువుకోవాలి" అన్నది తల్లి.

చాలా రోజుల తరువాత తల్లి నోటినుంచి అన్ని మాటలు ఒక్కసారే విన్నాడు. ఆప్యాయంగా తల్లి మెడ కౌగిలిచుకున్నాడు.

ఇంకెప్పుడూ తల్లి దగ్గర ఆమాట ఎత్తలేదు వాసు. కానీ, తన అలవాట్లలో ఎన్నో మార్పులు తెచ్చుకున్నాడు. చిరిగిన స్కూలు నిక్కరును కుట్టి ఇస్తే సంతోషంగా తొడుక్కున్నాడు. అప్పటికప్పుడు కొత్త నిక్కరు కావాలని మారాం చేయలేదు. చాక్లెట్లు కావాలని, గారెలు చేయమని, బూరెలు చేయమని గారాలు పోవడం మానేశాడు. చెల్లి ఏడిస్తే భుజంమీద వేసుకొని జోకొట్టడం నేర్చుకున్నాడు. తండ్రి దూరం కాగానే వాసు వయసుకు మించిన పెద్దవాడైపోయాడు.

కానీ... ఈమధ్య తండ్రి మాటిమాటికీ గుర్తుకొచ్చి వాసు పసిమనసు దిగులు పడుతున్నది. తన స్నేహితులు అప్పటికే ఆరాలు మొదలుపెట్టారు. కొందరు చులకనగా చూస్తున్నారు.

ఒకసారి తండ్రిని చూడాలని వున్నది. దూరం నుంచైనాసరే. తనను తండ్రి దగ్గరికి తీసుకోకున్నా సరే, పలకరించకున్నా సరే.

తనను చూస్తే తండ్రి తప్పక దగ్గరికి పిలుస్తాడు. తనను ప్రేమగా గుండెలకు హత్తుకుంటాడు. అప్పుడు తండ్రి మెడచుట్టూ చేతులువేసి తాను మాట్లాడ్తాడు. తల్లి ఎంత దిగులు పడుతున్నదో చెబుతాడు. ఎంతగా ఎదురు చూస్తున్నది చెబుతాడు. తండ్రి మనసు కరిగి ఒకసారైనా తనతో ఇంటికి వస్తాడు. తల్లి మునుపటిలా సంతోషంగా ఉంటుంది. అని ఆశగా ఆలోచిస్తున్నాడు వాసు. తండ్రి అడ్రస్ కోసం ప్రయత్నించసాగాడు.

సాయంత్రం... స్కూలు నుంచి ఆలస్యంగా వస్తేనే తనకోసం ఎదురుచూస్తూ గడపలో నిల్చుంటుంది తల్లి. ఆరోజు గంట ఆలస్యంగా వచ్చాడు. "స్పెషల్ క్లాసుందా నాన్నా?" అని అడిగింది. వాసు తలూపాడు.

తండ్రి ఉంటున్న మేడను చూసి వచ్చిన విషయం తల్లికి చెప్పలేదు.

మేడముందు పెద్ద గేటు ఉంది. ఆ గేటుదాటి లోనికి వెళ్లాలంటే భయమేసింది. రోడ్డుకు ఇవతలినుంచే తండ్రి కనిపిస్తాడేమోనని ఆశగా చూసి చూసి... ఇంకా ఆలస్యమైతే తల్లి కంగారు పడుతుందని నిరాశతో తిరిగి వచ్చేశాడు. తండ్రి కనిపించలేదు.

ఆ గేటు దాటి తండ్రిని కలుసుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు వాసు. ధైర్యం కూడగట్టుకుంటున్నాడు.

అంతలో వాసు పుట్టినరోజు వచ్చింది. మరునాడే పుట్టినరోజు. రాడని తెలిసికూడా తండ్రి వస్తాడని, కొత్తడ్రెస్ తెస్తాడని ఊహించుకున్నాడు.

తల్లిని కొత్తడ్రెస్ కోసం అడగలేదు. తల్లి కుడుతుంటే చూశాడు.

"క్లాత్ ఎప్పుడు కొన్నావమ్మా?" అని అడిగాడు.

"ఇక్కడికి అమ్మ వస్తే తీసుకున్నా బాబు" అని చెప్పింది తల్లి.

ఎలా ఉంది అని అడుగుతుందేమో "చాలా బాగుందమ్మా" అనాలి అనుకున్నాడు. కానీ తల్లి అడగలేదు.

తనే అన్నాడు

"చాలా బాగుందమ్మా... మా మంచి అమ్మ" అని ఒడిలో తలపెట్టి మురిపెంగా తల్లి బొజ్జమీద ముద్దుపెట్టుకున్నాడు.

మరునాడే తన పుట్టినరోజు అని తలచుకుంటూ వుంటే ఆ రాత్రంతా వాసుకు నిద్రపట్టలేదు. ఒక వంక సంతోషం. మరోవంక తీరని విచారం. సూటిపోటి మాటలు, ఎగతాళి తెలుసు కనుక మిత్రులనెవరినీ పిలువలేదు.

తల్లి చాలు తనకు మిఠాయి తినిపించడానికి. చెల్లిచాలు తనకు శుభాకాంక్షలు చెప్పడానికి...

కానీ... మరునాడు తల్లి తనకు తలంటి స్నానం చేయించి, కొత్త దుస్తులు తొడిగి, దేవునికి దండం పెట్టించిన తరువాత తల్లి పాదాలకు ప్రణమిల్లాడు. తండ్రిని తలచుకొని కంటనీరు పెట్టుకున్నాడు. తల్లి కంటపడకుండా తుడిచేసుకున్నాడు.

గాలికి తలుపు కదిలితే తండ్రే వచ్చాడని ఉలిక్కిపడి చూశాడు.

గుమ్మంలో తాను ఊహించిన దృశ్యం కనిపించలేదు.

తండ్రిని ఒకసారి చూడాలనే తపనకు ఆ చిన్నారి మనసు ఇక తట్టుకోలేక పోయింది.

కొంతసేపటికి తల్లి చెంపల్ని ముద్దుపెట్టుకొని, ఆప్యాయంగా ఆమె ఒడిలో పసిపాపలా బజ్జొని...

"ఒక్కసారి బయటికి వెళ్లిరానా అమ్మా..." అని అడిగాడు.

తల్లి ఆ కళ్లలో కదిలే తడి భాషను అర్థం చేసుకుంది.

"తొందరగా రావాలి..." అని మాత్రం అన్నది.

"అట్లాగే అమ్మా..." పరుగు పరుగున బయటికి నడిచాడు వాసు.

ఆప్యాయతలు, అనురాగాలు మరచిన తండ్రికి తన పుట్టినరోజు గుర్తుండకపోవచ్చు. కానీ, వాసు తండ్రిని ఆరోజు కలుసుకోవాలనే పట్టుదలతో బయలుదేరాడు.

తండ్రినిచూసే ఆ క్షణాలను తలచుకుంటేనే ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు.

మేడముందు ట్రాఫిక్ ప్రవాహం సాగిపోతున్న రోడ్డు.

రోడ్డుకు ఇవతల ఒక చెట్టుచాటుకు నుంచొని గేటువంకే చూస్తున్నాడు వాసు.

తండ్రి కారులో బయటికి వస్తాడేమో ఎదురు వెళ్లాలి అనుకున్నాడు. "నాన్నా!" అని పిలవాలి అనుకున్నాడు. కనీసం దూరంనుంచైనా చూడాలి అనుకున్నాడు.

గేటుదాటి లోనికి వెళ్లడానికి మాత్రం వాసు చిన్నారి పాదాలు తిరస్కరించాయి.

పావుగంట... అరగంట... ముప్పావుగంట కాబోతున్నది. కొత్త దుస్తులు చెమటతో తడిసిపోతున్నాయి. గొంతు ఎండుక పోతున్నది. దాహంగా ఉంది. తండ్రి కనిపించలేదని నిరాశగా ఉంది. తండ్రి రూపం కళ్లలో మెదిలి తండ్రి లాలనలు గుండెను తొలిచి ఆ పసివాడి ఉసురు పోసుకుంటున్నాయి.

కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి.

ఆలస్యమైతే తల్లి తనకోసం ఆందోళన పడుతుందని బెంగ ఒకవంక...

గేటుదాటి ఒక్కసారి తండ్రిని చూడాటానికే నిశ్చయించుకున్నాడు వాసు.

బలవంతంగా ఒక అడుగు ముందుకు వేశాడు. నాన్న ఆ మేడలో లేడేమో, బయటికి వెళ్లాడేమో, ఊరికి వెళ్లాడేమో...

అడుగు వెనక్కు తీసుకున్నాడు.

మళ్లీ తండ్రిచుట్టూ ఆలోచనలు.

ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్లడు. మేడలోనే ఉంటాడు.

మరోసారి అడుగువేసి... తడబడుతూ మరో అడుగువేసి... తండ్రిని చూడాలనే ఆరాటంతో రోడ్డుమధ్యకు వచ్చేశాడు వాసు. కానీ గేటు చేరుకోలేక పోయాడు. అమ్మ అభిమానం గుర్తుకు వచ్చింది. తండ్రి రమ్మంటే రానని తను తల అడ్డంగా తిప్పడం గుర్తుకొచ్చింది.

అడుగులు తడబడి ఎటూ కదల్లేక పోయాడు.

అంతలో వేగంగా దూసుకువస్తున్న కారు వాసును ఢీకొట్టింది.

క్షణంలో రక్తపు మడుగులో వాసు... అదృష్టవంతుడవ్వారంతా. కాలిమీదినుంచి పోయేదే... సడన్ బ్రేక్‌తో ఆగింది. కాలికి గాయమై రక్తం చిమ్మింది. వాసు స్పృహతప్పి పడిపోయాడు.

ఆ కారును నిర్లక్ష్యంగా, వేగంగా డ్రైవ్ చేసిన ఆమె పర్స్‌తోసహా కారు దిగింది. ఆ అబ్బాయి తాలూకు ఎవరైనా ఉంటే డబ్బు చేతిలో పెట్టి నోరు మూయించాలి అనుకున్నది.

ఆమే శైలజ.

శైలజ వెనక కారుదిగి వచ్చినవాడు తండ్రి. కొడుకును గుర్తుపట్టి...

"వాసూ..." అని ఒక్కపెట్టున అరిచాడు. అతని గుండెలోతుల్లోంచి కట్టలు తెంచుకొని దుఃఖం పొర్లివచ్చింది.

"నాన్నా వాసూ..." కొడుకును అమాంతం రెండుచేతుల్లో ఎత్తుకొని దగ్గరలోని ఆసుపత్రికి పరుగున తీసుకుపోయాడు.

కొడుకు అమాయక మొహం చూస్తుంటే అతని పేగులు సుడులు తిరుగుతున్నాయి.

రెండురోజుల తరువాత వాసుకు స్పృహ వచ్చింది. ఆ రెండురోజులూ తండ్రి ఆసుపత్రి విడిచి వెళ్లలేదు.

వాసు తల్లి, చెల్లెలు దగ్గర కూర్చుని దీనవదనాలతో చూస్తున్నారు.

కళ్లు తెరిచిన వాసుకు ఎదురుగా తండ్రి కనిపించాడు.

"నాన్నా..." ఆర్తిగా తండ్రి మెడను చుట్టేశాడు వాసు "ఇవ్వాళ నా పుట్టినరోజు నాన్నా" అన్నాడు. అప్పుడే అక్కడికి వచ్చిన శైలజ ఆ దృశ్యాన్ని చూసింది. ఆమె గుండెలవిసిపోయాయి. గిరుక్కున సజల నయనాలతో అక్కడినుంచి తప్పుకుంది.



ANEJA / PPL / 02 / 96.